# చిందొర్సాని

"ఛల్ ఛల్ గుర్రం... చలాకి గుర్రం
ఛల్ ఛల్ గుర్రం... ఛల్ రే గుర్రం
బుల్ బుల్ గుర్రం... భలేది గుర్రం
నడువ్... ఏయ్ గుర్రం నడువ్..."

పాలేరు వెంకన్న వీపు మీద కూర్చొని చేతిలో ఉన్న చిన్న కర్రతో కొడుతూ నడువ్ నడువ్ అంటూ ఆనందిస్తోంది ఎనిమిదేళ్లమ్మాయి సుజాతాదేవి.

అరగంట పైగా మోకాళ్లపై నడుస్తున్న వెంకన్న మోకాళ్లు కొట్టుకుపోయున్నాయి. రక్తం కారుతోంది... వాకిలి నిండా రాళ్లుండటంవల్ల నడవడానికి అయాసపడుతున్నాడు. కాని, వెంకన్న ఆగినా, మెల్లగా కదిలినా కర్రతో వీపుపై చురుక్కుమనిపిస్తోంది సుజాతాదేవి.

"చిందొర్సానీ! ఓ చిందొర్సానీ! గిట్ల నడువబట్టి సాంచేపైంది. మోకాళ్ల మంటలు మండుతున్నయ్. రక్తం కారుతంది. ఇయ్యాలటికి సాలు, దిగమ్మా" అన్నాడు నడవడం అపి వెంకన్న దీనంగా.

అయినా ఆమె వినడంలేదు.

"బాపును పిలువనా! బాపూ! ఓ బాపూ!" కేకేసింది.

"చిందొర్సానీ! దొరను పిలువకు, బాంచెను... నడుస్త." ఎంత నొప్పిగా ఉన్నా దొరవస్తే కొడతాడని భయపడుతూ నడుస్తున్నాడు వెంకన్న.

"ఛల్ ఛల్ గుర్రం... చలాకి గుర్రం..."

వెంకన్న నరకయాతన ననుభవిస్తుంటే సుజాతాదేవి పాశవికానందాన్ని పొందుతుంది.

మరికొంతసేపు నడిచి ఆగిపోయాడు వెంకన్న. ఇక నడువలేకపోతున్నాడు.

"చిందొర్సానీ... ఇగ నా నుంచి గాదు. సాలిగ." ఆమెను దించి కూలబడ్డాడు వెంకన్న. మోకాళ్లనుంచి కారుతున్న రక్తాన్ని పంచెతో తుడుచుకుంటున్నాడు.

"బాపూ! ఇగజూడే... ఈడు నడువడటనే!" హటంబెడుతూ ఏడవడం మొదలుబెట్టింది సుజాత...

కూతురు ఏడుపు విని ఇంటి వెనుకున్న వాకిట్లోకొచ్చాడు రంగారావుదొర. అతని వయసు యాభై వరకున్నా దబ్బపండులా ఉన్నాడు. నున్నగా గొరిగున్న మీసాలాతని వయసును మరింత తక్కువజేసి చూపుతున్నాయి.

సుజాత ఏడవడం చూసిన రంగారావు కళ్ళు క్రోధంతో ఎర్రబడ్డాయి.

దొరను చూసి వెంకన్న లేచాడు. రెండు చేతులు దగ్గరకనుకొని పబ్బతి పట్టుకొని నిల్చున్నాడు దొర దగ్గరకొస్తున్నకొద్దీ గడగడ వణికిపోతున్నాడు.

వెంకన్న కొక గజం దూరంలో నిల్చుని రంగారావు-

"చిన్న దొర్సానినెందుకేడ్పిస్తన్నవురా?" అన్నాడు కోపంగా.

"ఇంకా గుర్రమాట ఆడల్నట. జాంపొద్దు నుంచాడుతున్న దొర! మోకాళ్లు, మోచేతులన్నీ కొట్టుకపోయినయ్. బాంచెను... ఇగో జాడుంన్డి రక్తం కారుతంది. ఇగ సాలంటె ఏడుత్తంది చిందొర్సాని" మోకాళ్లను, మోచేతులను చూపుతూ అన్నాడు వెంకన్న. రక్త మోడుతున్న వాటిని చూడనేలేదు రంగారావు.

"దొంగ...కొడుక...చిన్న దొర్సానంటె ఏిందనుకున్నవురా? నా బిడ్డ నేడిపిత్తవా? నీకు కాళ్లు నొత్తన్నాయా? సత్తవా ఇంకాసేపాడితె?" అంటూ బూతులు తిడుతూ, ఎడమ కాలితో రెండు తన్నులు తన్నాడు రంగారావు.

వెంకన్న కళ్ల వెంట నీళ్లొస్తున్నాయి. అయినా ఆపుకుంటున్నాడు. మోకాళ్లు, మోచేతులు మండుతున్నాయి. దొరనేమనే శక్తిలేక అలాగే నిల్చున్నాడు వెంకన్న.

"మంచిగైంది... మంచిగైంది..." అని చప్పట్లు కొడుతూ "ఈసారి ఆడుమన్నంత సేపాడకుంటె ఇంక బాగ కొడుతడు మా బాపు" అంది సంబరపడుతూ సుజాత.

"ఇంక నిల్చున్నవేందిర? కొట్టంకాడికి పొయ్యి ఎడ్ల నిడిసిపెట్టి నీళ్ళు పెట్టుకరా. కట్టేసి మ్యాతెయ్యి. పాలేరు గాడ్దికొడుకులను దున్నపోతులను పెంచినట్టు పెంచాలె... పో" అని గద్దరించినట్టన్నాడు రంగారావు.

"పోత... బాంచెను" అని వెంకన్న తల వంచుకొని అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు.

"రా బిడ్డ రా" అని సుజాతను తీసుకొని ఇంట్లోకెళ్లాడు రంగారావు.

ఆ ఊళ్లో పెద్ద భూస్వామి రంగారావు. పాలేర్లంటే చులకన, హీనభావం సుజాతకు తండ్రినుంచే సంక్రమించింది. చిన్నతనంలో వాళ్లనామె రాచి రంపానపెట్టేది. ఇంట్లో పని చేసే పనిమనుషులను హీనాతిహీనంగా చూసేది. ఊళ్లోనే ఉన్న పాఠశాలకు ఆమె సవారు బండ్లో పోయేది, తిరిగొచ్చేది. లేదా పాలేర్లే తీసుకెళ్లేవారు. తీసుకొచ్చేవారు. పాలేర్లు, వాళ్ళింట్లో పనిచేసే ఆడవాళ్లు ఎంత భయం భయంగా పనిచేసినా సుజాత ఆగ్రహానికి గురికాక తప్పేది కాదు. ఆమె పెంకితనం వల్ల వాళ్లు దొరతో ఎన్నోసార్లు తిట్లు, దెబ్బలు తినేవారు. దొరకు, చిన్నతనంలో సుజాతకు వాళ్లు నోరులేని పశువులకంటే అధ్వాన్నమే.

చాకల్లు, మంగల్లు, పనిజనం...దొర, దొర కుటుంబం కనుసన్నల్లో మెదిలే ఎంతోమంది దొర ఇంట్లో ఉండేవారు. సుజాత ఏది కావాలంటే అది ఆగమేఘాల్లో వచ్చేది. ఆమె కాలుకింద పెట్టకుండానే పెరుగుతోంది. అపురూపంగానే పెరుగుతోంది.

అయితే బడి, ఇల్లు తప్ప సుజాతకు మిగతా విషయాలేం తెలియవు. బడిని దాటి వేరే ప్రదేశాలకు పోయిందీ లేదు. దొర బిడ్డ గనుక ఆమెకు స్నేహితులు, స్నేహితురాళ్లూ తక్కువే.

వయసు కొంత పెరుగుతున్నకొద్దీ ఆమెలో ఆలోచన పెరుగుతోంది. పెంకితనం కొద్దికొద్దిగా తగ్గుతోంది. తానెరిగిన ఇల్లు, బడే కాకుండా మిగతా లోకాన్ని చూడాలన్న ఆలోచనొస్తోంది. కూలినాలి జనంపై తండ్రి చూపే పెద్దరికం, చేసే దౌర్జన్యం చూసి ఆమె ఇప్పుడు మునుపట్లా ఆనందించడంలేదు.

సుజాతకిప్పుడు పన్నెండేళ్ళు. ఓ రోజు తండ్రితో అంది:

"బాపూ! నేనాడుకుంటాను."

"ఆడుకో... ఎవరద్దన్నారు?" అన్నాడు రంగారావు.

"నా స్నేహితురాలింటికెళ్ళి ఆడుకుంటాను."

"ఎవతది?"

"రాజనర్సయ్య బిడ్డ"

"గా సాపలు పట్టుకునెటోని బిడ్డతోని ఆడుడేంది? అలుగా జనంతోని సోపతులు జెయ్యద్దు. మనింట్లనే ఆడుకో ఇంటెనుక, ఇంటి ముంగట మస్తు జాగుంది గద"

"లేదు బాపూ... నేనక్కన్నే ఆడుకుంట. అక్కడైతే చాలా మందుంటరు."

"అద్దని సెప్పిన్నా... గాల్లతోని సోపతేంది?"

అయినా వినలేదు సుజాత.

"చెప్పితె వినబడుతలేదా? బాగొర్లుతున్న వేంది? అయితె దాన్నే ఇక్కడికి రప్పిస్తతియ్యి" గద్దరించినట్టని,

"అరె పోషిగా! గా తెనుగు రాజనర్సని బిడ్డను తీసుక రాపో. రోజిక్కడికి రమ్మను. చిన్నదొర్సానితోని రోజూ కొంతసేపు ఆడుకొని పొమ్మను. నేం జెప్పిన్నని సెప్పి తీసుకరాపో" అన్నాడు రంగారావు.

"అట్లనే దొర" అని పోచయ్య రాజనర్సయ్య ఇంటి దిక్కు పరుగెత్తాడు.

ఆ అమ్మాయి రోజూ వచ్చి సుజాతతో ఆడుకునేది. సుజాత ఇంకెవరితోనైనా ఆడుకుంటానన్నా వాళ్లనే ఇంటికి తెప్పించేవాడు రంగారావు. కాని, సుజాత మాత్రం వేరే చోటికి పోవడం చాలా అరుదు. అప్పుడప్పుడు తల్లితో మాత్రం వేరే దొరల ఇంటికి పేరంటాలకు పోయేది.

పాఠశాలలోనూ ఆమెను "దొరబిడ్డ దొరబిడ్డ" అని ప్రత్యేకంగా చూసేవారు. ఆమె అందరిలా తనకు ఇష్టమున్నట్టు ఆడుకోవడానికి వీలుండేది కాదు. బడి పిల్లలు ఆటల పిరియడ్‌లోనూ ఏ టీచరైనా లేని సమయంలోనూ దగ్గరున్న చెరువు దగ్గరికెళ్లి ఆడుకునేవారు. చెర్లో రాళ్లేస్తూ ఆనందించేవారు. వాళ్లతో పోతానంటే పాఠశాల ప్యూను, ఉపాధ్యాయులు వద్దనేవారు. దొరకు తెలిస్తే తిడుతాడని పోనిచ్చేవారు కాదు. ఓ రోజు ఉపాధ్యాయులు, ప్యూను వద్దంటున్నా చెరువు దగ్గరికెళ్లి ఆడుకుంది. పక్కనే ఉన్న చేన్లోకెళ్లింది. ఆ విషయం రంగారావుకు తెలిసింది. రంగారావు సుజాతతో వెళ్లిన స్నేహితురాళ్ల తండ్రులను ఇంటికి పిలిపించాడు. కొట్టబోయాడు. తిట్టాడు. సుజాతను కూడా గద్దరించాడు. అలాంటి పని చేయకూడదని హెచ్చరించాడు. సుజాతకు తల తీసేసినట్టయింది.

సుజాతకు 'ఫ్రీబర్డ్'లా ఎగరాలని, స్నేహితురాళ్లతో ఆనందంగా గడపాలని, ఎన్నో చూడాలని, ఆడాలని, పాడాలని, ఎన్నో పనులు చేయాలని కొర్కెగాఉండేది. ప్రకృతి సౌందర్యాన్ని తనివితీరా చూడాలని, పొలాల్లో, చేను గట్లపైన లేడిలా గంతులేస్తూ తిరగాలని కోరుకునేదామె. కాని తండ్రినుంచి ఆమెకు బయట తిరగడానికి అనుమతిలేదు. ఇంట్లోనే నాలుగు గోడల మధ్యనే ఆమె బిక్కుబిక్కుమంటూ ఉండేది. ఎప్పుడన్నా తండ్రి సవారెడ్ల బండ్లో మొక్కుజొన్న పెరడు దగ్గరకు తీసుకెళ్లేవాడు. తాను పెరడు చూడడమయింతర్వాత తీసుకొచ్చేవాడు. అలాంటివాటితో అమెకెప్పుడూ తృప్తిగా ఉండేదికాదు.

డబ్బు, హోదా, దాసదాసీజనం, ఎకరం వైశాల్యంలో ఇల్లు, ఎకరాలకొద్దీ భూములున్నా అసంతృప్తిగానే ఉండేది సుజాతకు. పెద్దగా డబ్బులేకున్నా తన స్నేహితురాళ్లే హాయిగా బతుకుతున్నారనుకునే దొకొకప్పుడు. తన తల్లి ఎంతో బాగున్నా తండ్రి ఇతర స్త్రీలతో సంబంధాలను పెట్టుకోవడం గమనించింది. జమిందారీ కుటుంబాల్లో స్త్రీకిచ్చే విలువేంటో ఆమెకు మెల్లమెల్లగా అర్థమవుతోంది. సుజాత తల్లికి గృహ సంబంధమైన ఏ విధమైన నిర్ణయాలలోనూ పాత్ర లేకపోవడం గమనిస్తోందామె. తామె దొరసానులుగా పిలువబడుతున్నా తమ అధికారం ఏమైనా ఉంటే నాలుగు గోడల వరకే పరిమితమై ఉండటం చూస్తోందామె.

సుజాత సమాజాన్ని కొద్దికొద్దిగా అర్థం చేసుకుంటున్న వయసులోకొచ్చిన సమయంలో ఊళ్లో మార్పులు రావడం గమనించిందామె. కూలినాలి జనాల్లో పోరాటాలూ ప్రారంభమయ్యాయి. ఇంతవరకు అణగిమణగి ఉన్నవాళ్లే రంగారావులాంటివాళ్లను ఎదిరించి మాట్లాడటం చూసిందామె రంగారావు లాంటివాళ్ల అధికారాలు మునుపట్లా నడవకపోవడం, క్రమక్రమంగా వాళ్లు కోరలు తీసిన పాముల్లా తయారు కావడం గమనిస్తోందామె.

ఊళ్లలో వస్తున్న మార్పులు నేపథ్యంలోంచి తన అన్నలు వదినలపై నడుపుతున్న అధికారాలను, తన తల్లిపై తండ్రి, అన్నల అధికారాన్ని, దొరసాన్లుగా పిలువబడుతున్నా తన తల్లి, వదిన లాంటి వాళ్లనుభవిస్తున్న మూగవేదనను అర్థం చేసుకుంటోందామె. కాని వాళ్లకా స్పృహ ఉన్నట్టు ఆమె దృష్టిలోకి రాలేదు. సహజంగా చురుకైనదైన సుజాత తన భవిష్యత్తుగూర్చి ఆలోచిస్తోంది. రంగారావు లాంటివాళ్ల అధికారాలు బయట కొంత తగ్గినా ఇంట్లో వెలగబెడుతూనే ఉన్నారు. తనది దొరల కుటుంబమన్న అహంభావం ఇంకా అతనిలో ఉండనే ఉంది.

సుజాత ఇప్పుడు ఊళ్లో ఉన్న ఎస్.ఎస్.సి. పూర్తి చేసింది.

"సుజాతా! నువ్వు చదివిన వరకు చాలు. ఇక నీ చదువు బందుజేద్దాం" అన్నాడు రంగారావు.

"బాపూ! నాకింకా చదువుకోవాలనుంది."

"ఆడపిల్లల కింకా చదువెందుకమ్మా? చదివింది చాలు."

తండ్రి మాటలు విని సుజాత ఆశ్చర్యపోయింది.

"ఆడపిల్లైతే మాత్రం చదువుకోవద్దా నాన్నా?"

"మన ఊళ్లో కాలేజీ లేదు. ఎక్కడికో పోయి చదువుకోవాలి. ఆ తిప్పలన్నీ ఎందుకు? పైగా మనం దొరలం. నీకో సంబంధం చూస్తున్నాను. పక్కూరు దొర కొడుకు. బాగా ఉన్నోళ్లే... జెప్పున పెళ్లి చేయాలనుకుంటున్నా."

చదువుకోవడానికి అన్ని వసతులున్నా తమలాంటి కుటుంబాల్లో స్త్రీలు పెద్ద చదువులు చదవడం చాలా అరుదుగావడం ఎందుకో సుజాతకిప్పుడు అర్థమవుతోంది. దొరసాన్ల పేరుమీద తన తల్లి, వదినలు అనుభవిస్తున్న జీవితాలామె చూస్తూనే ఉంది. ఓ దిక్కు దొరతనం వ్యవస్థకు బీటలు పడుతుంటే ఇంకా దాన్నే పట్టుకు వేలాడుతానంటున్న తండ్రిపై జాలిగా ఉందామెకు. ఏదేమైనా తాను మాత్రం చదువు కొనసాగించాలనే నిర్ణయించుకుంది.

"నాన్నా! నాకిప్పుడే పెళ్లి వద్దు. మీరు చూసే దొరల సంబంధం గూర్చి మరిచిపోండి. ప్రస్తుతానికి నేను చదువుకుంటాను. నా చదువయిపోయేంతవరకు నా పెళ్లి మాట ఎత్తవద్దు."

కూతురుపై తీవ్రమైన ఆగ్రహాన్ని వెళ్లగక్కాడు రంగారావు. అయినా ఆమె తన పట్టు విడువలేదు. మునుపట్లా తన దొరతనం సాగితే పరిస్థితెలా ఉండేదో కాని, ఇప్పుడు కూతురు మాటకు ఔననక తప్పలేదు రంగారావుకు.

ఇంటర్ పూర్తయిన తర్వాత కూడా చదవాపడానికి ప్రయత్నించాడు. కాని సుజాత పట్టుబట్టి డిగ్రీలో చేరింది. డిగ్రీలో చేరిం తర్వాత ఆమెకి ఊరొదిలి జిల్లా హెడ్‌క్వార్టర్లో ఉండాల్సి వచ్చింది. ఊరొదిలింతర్వాతే అసలు ప్రపంచమంటే ఏంటో తెలిసొచ్చింది. సమాజంపై అవగాహ నేర్పడింది. దేశమంటే ఏమిటో అర్థమయింది. ఇంతకాలంగా తానేం కోల్పోయిందో అనుభవంలోకొచ్చింది. తానెంత కూపస్థ మండూకంలా, పంజరంలోని చిలుకలా బతికిందో పూర్తిగా అర్థమైంది. తనలాంటి చిన్న దొర్సానుల బతుకేంటో అవగాహనైంది. మంచి సాహిత్యంతో పరిచయం ఆమెను మరింత ఎదిగేలా చేసింది.

పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చదవడానికామె హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో ఆమెకి వివిధ సాహిత్య, సాంస్కృతిక సంఘాలతో పరిచయా లేర్పడ్డాయి. ఫెమినిస్టు ఉద్యమాలతోనూ సంబంధాలు పెరిగాయి. ఆమె ప్రపంచం ఇప్పుడు మరింత విశాలమైంది.

ఈమధ్య ఊళ్లలో మార్పులు మరింత శీఘ్రతరమయ్యాయి. 'దొరా, అయ్యబాంచెను, అవ్వబాంచెను' సంస్కృతి చాలావరకు దూరమైంది. చాలామంది దొరల అధికారానికి గండిపడింది. ఒకవిధంగా దొర అనేపదం తిట్టుపదమనేంత మార్పువచ్చింది. ఈ పరిస్థితులతో కొంతమంది దొరలనబడే వాళ్లు సర్దుకున్నారు. పరిస్థితుల కనుగుణంగా ప్రవర్తించడం మొదలు పెట్టారు. డాబు, దర్పాలను వదులుకున్నారు. రంగారావులాంటి అధికారమదం, ధనగర్వంతో విర్రవీగే వాళ్ళు మాత్రం పరిస్థితులతో రాజీపడలేకపోతున్నారు. ఏదో కోల్పోయినట్టు బావిస్తున్నారు. ఇంకా దేనికోసమో వెతుకులాడుతున్నారు. సిటీలో సుజాత ఏవేవో సంస్థలతో

సంబంధాలు పెట్టుకుంటోందని విన్నాడు రంగారావు. కూతురు తనకు కాకుండా పోతోందని భావించాడు. ఆమెను ఊరికి పిలిపించాడు.

☆ ☆ ☆

"ఇదమ్మా నీ కూతురు ఇన్ని రోజులుగా గడిపినజీవితం. మీ చిన్నదొర్సాని అనుభవించిన జీవితం. అమ్మా! నేనేం కాని పనులు చేయడంలేదు. నా అవగాహనను మరింత విశాలం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. నేను ఈ ఊరు దాటింతర్వాతే అసలు ప్రపంచాన్ని చూశానమ్మా!" అంది తల్లితో సుజాత.

"దొర కూతురుగా బాగ కష్టపడ్డననా నీ ఉద్దేశ్యం? అసలు నీకేం తక్కువైందని?" కోపంగా అడిగింది సుజాత తల్లి.

"ఏం తక్కువైందో నీకింతవరకే చెప్పాను. మనది దొరల కుటుంబం, మనం దొరసానులంకదా అమ్మా! అసలు మన బతుకేంటో నువ్వెక్కడైనా ఆలోచించావా? మనం బంగారు పంజరంలోని చిలుకలమమ్మా! అమ్మా! నువ్వు బాపుతో నలభై ఏళ్లుగా కలిసి జీవిస్తున్నావు. ఏ విషయంలోనైనా బాపు నిన్ను సంప్రదించాడా? మనకెంత భూముందో నీకు తెలుసా? ఒక్క పొలం సరిహద్దులనైనా నువ్వు చూపగలవా? ఇన్నేళ్లలో నువ్వు ఇల్లు దాటి ఎన్నిసార్లు బయటికెళ్లావమ్మా! మగవాళ్లు చేసే ఏ పనులు గూర్చీ మనమడుగ కూడదు. వాళ్లకు సుఖాలనిచ్చే మరబొమ్మలుగా మాత్రం మనముపయోగపడాలి. ఇదమ్మా దొరల కుటుంబాలల్లోని దొరసానుల పరిస్థితి. మనం దొరలకు సానుల్లాంటివాళ్లం - అంతేకదమ్మా!"

సుజాత మాటలామె తల్లికి కొత్తగా ఉన్నాయి. తరతరాల తమ దొరసాని బతుకులకు కూతురు కొత్త బాష్యాలు చెప్పడం ఆమెకు వింతగా ఉంది. అయితే, కూతురు మాటల్లో ఏదో మేరకు నిజమున్నట్టే అనిపిస్తోందామెకు. కాని, తమ ఇన్నాళ్ల బతుకిదని ఆమె ఒప్పుకోవడానికి సిద్ధంగా లేదు.

"గా కూలినాలి జనాలు తిరిగే సంఘాల లాంటియి నీకెందుకమ్మా! అలగాజనం పనులవి."

"అమ్మా! పురుషుల సంగతేమోకానీ స్త్రీల విషయంలోనైతే ఆ అలగాజనమనబడే స్త్రీల బతుకే మన దొర్సానుల బతుక్కంటే ఓ విధంగా నయమనిపిస్తుంది. ఆ కుటుంబాల్లో ఇద్దరూ కష్టపడతారు. కష్టాల్లో, సుఖాల్లో ఇద్దరికీ భాగస్వామ్యముంటుంది. ఒకరిపై మరొకరి అధికారముండదు. స్త్రీ భర్త తిడితే తానూ తిడ్తుంది. ఇష్టముంటే భర్తతో కాపురం చేస్తుంది. లేకుంటే తెగదెంపులు చేసుకుంటుంది. మరి మనకా స్వేచ్ఛ ఉందామ్మా? లేదు. ఎందుకంటే, మనం దొరసానులంకదా మరి! మన బతుకులు మన పాలేర్ల బతుకులకంటే అధ్వాన్నమమ్మా! మనం బానిసలం."

కూతురు మాటలు విని నోరు తెరిచిందామె.

"నిన్ను కిందకూడా నడిపించలేదు. పాలేర్ల భుజాలమీన్నే పెరిగావు. కాలు కిందబెడితే కందిపోతావన్నంత గారాబంగా పెరిగావు. నీకిప్పుడా బతుకు మంచి బతుకనిపించడంలేదు!" అంది సుజాత తల్లి.

"అమ్మా! నేను గారాబంగానే పెరిగాను. పాలేర్ల భుజాలపైన్నే పెరిగాను. కాని, వాళ్లను మనమెంత రాచిరంపాన పెట్టామమ్మా! వాళ్లను మనుషులుగా ఏ రోజైనా చూశామా? మనిషిని మనిషిగా చూడలేని అలాంటి కాలమే కావాలని కోరుకుంటున్నావా అమ్మా!

వాళ్ల సంగతి పోనీ, మన కుటుంబాల్లో నీకూ నాన్నకు, నాకూ అన్నయ్యలకు మధ్యనున్న తేడాను గమనించావా? ఇంకెందుకమ్మా నేనేదో తప్పు చేస్తున్నట్టు మాట్లాడతావు!"

తన చేతుల్లో పెరిగిన సుజాతకు ఇంత ప్రాపంచిక జ్ఞానం అలవడిందని ఊహించని ఆమె తల్లి కూతురు మాటలకు విస్తుపోయింది. సుజాతపై ఆమెకు వాత్సల్యంతోపాటు గౌరవమూ కలుగుతోంది. మరో దిక్కు బిడ్డ ఏమైపోతుందోనన్న భయమూ కలుగుతోంది. అయితే, తానేం చెప్పినా కూతురు దగ్గర సమాధానాలున్నాయని ఆమెకర్థమైంది. కూతురు మాటలు వింటుంటే తన జీవితమంతా జ్ఞాపకం వచ్చిందామెకు. భయం, సంతోషం ముప్పిరిగొనగా ఆమె—

"అయితే, మేమిన్నాళ్లు బతికింది బతుకే కాదంటావు. నీకే అన్నీ తెలుసంటావు. నీ ఇష్టమొచ్చినట్టే తిరుగుతానంటావు. అంతేనా? నీ ఇష్టమున్నట్టే చేసుకో." నిష్ఠూరంగా అంది సుజాత తల్లి.

ప్రక్కగదిలో ఉండి వాళ్ల మాటలు వింటూన్న రంగారావు కోపంగా బయటకొచ్చాడు.

"చదువేత్తే ఉన్న మతిపోయిందట. నిన్ను చదువించడం నా తప్పైంది. నీకీ బతుకు సానకష్టంగా ఉందికదా! మేం గిట్లనే బతుకుతం. నీకు మేం గావాలో ఆ లేకిడి ఉద్యమాలే కావాలో తేల్చుకో" అన్నాడు మండిపడుతూ.

"బాపూ! చదువుకొని నేనేం చెడిపోలేదు. ఇకముందు చెడిపోను కూడా! చదువువల్ల నేను ప్రపంచాన్ని చూడగల్గాను. సమాజాన్నర్థం చేసుకోగలిగాను. అమ్మా! ఇంత మాత్రానికే మీరెందుకింత గగ్గోలు పెడుతున్నారు? అసలు నేనేం చేశానని? తుపాకీ పట్టుకొని అడవుల్లోకెళ్లానా? స్త్రీ ఉద్యమాల పట్ల కొంత సానుభూతితో ఉన్నాను. అంతేకదా! కాకపోతే ఉన్నదున్నట్లు మాట్లాడుతున్నాను.

"బాపూ! ప్రపంచ వ్యాప్తంగా మార్పులొస్తున్నాయి. మన గ్రామాల్లోనూ మార్పులొస్తున్నాయి. ఇవేవీ గమనించకుండా తాబట్టిన కుందేలుకు మూడే కాళ్లని పట్టుబట్టుకొనుంటే కష్టం. కాలంతోపాటు మనమూ మారాలి. ఓ దిక్కు మీరనుకునే దొరతనం వ్యవస్థలు బీటలు పారడం స్పష్టంగా కనబడుతున్నా ఇంకా అదే కావాలని కోరుకుంటే చేసేదేముంది?

"బాపూ! మీరనుకున్నట్టు బతకడం నాకు సాధ్యం కాదు. అందుకు నా మనసంగీకరించదు. తర్వాత మీ ఇష్టం."

తాను చెప్పదలుచుకున్నది సూటిగానే చెప్పి లేచి తన గదిలోకెళ్లింది సుజాత.

కూతురు మాటల గూర్చి ఆలోచిస్తోంది సుజాత తల్లి.

ఆమె పోయిందిక్కు కోపంగా చూస్తున్నాడు రంగారావు.

● *విపుల, మాసపత్రిక, డిశంబర్, 1994* ●